ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
శుక్రవారం 12 సెప్టెంబరు 2025



నేడు వినియోగదారుల గ్రీవెన్సెస్ మీటింగ్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి శుక్రవారం శంషాబాద్ మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో కన్స్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికారులుగురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర వాటిపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాదాబైనామాల అమలు సాహసోపేత నిర్ణయం

- షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.9.89 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామాల అమలు సాహసోపేత నిర్ణయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీఆర్ తర్వాత ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సాదాబైనామాలను క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సాదాబైనామాల క్రమబద్ధీకరణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ధరణిని ప్రవేశపెట్టి రైతులను నట్టేట ముంచారని ఆరోపించారు. సాదా బైనామా విషయంలో ప్రతీరోజు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. 2020 అక్టోబర్ 12 వరకు సాదాబైనామాలకు వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని వాటిని క్రమబద్ధీకరించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

రూ.9.89 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.89 కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.2.20 కోట్లు, అలాగే షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో 8,9,10 వార్డుల్లో పార్కుల నిర్మాణం కోసం రూ.4కోట్లు, అలాగే ఫరూఖ్‌నగర్, నందిగామ మండలాలోని ఉన్నత పాఠశాలలో మరమ్మతుల కోసం రూ.1.20 కోట్లతో మరమ్మత్తులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నందిగామ - జేపీ దర్గా రహదారి విస్తరణ కోసం రూ.50లక్షలు, ఫరూఖ్‌నగర్ మండలం కంసానిపల్లి నుంచి నాగర్‌గడ్డ తాండ వరకు బీటీ నిర్మాణానికి రూ.20 లక్షలు, నందిగామ మండల పరిధిలోని చెగూరు గిరిజన తండా బీటీ నిర్మాణం కోసం కోటి రూపాయలు, జేపీ దర్గా నుంచి ఇన్ముల్‌నర్వ తాండ వరకు బీటీ నిర్మాణం కోసం రూ.2.70 కోట్లు వెచ్చించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దీక్షలో కూర్చున్న భూ నిర్వాసితులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

హైటెన్షన్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

అప్పటివరకు పోరాటం కొనసాగిస్తాం: భూ నిర్వాసితులు

కడ్తాల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అలైన్‌మెంట్‌ను మార్చే వరకు పోరాటం కొనసాగిస్తామని కడ్తాల మండల హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. పాలక ప్రజాప్రతినిధులు సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి తమకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు. కడ్తాల మండల కేంద్రంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. దీక్షలో రావిచెడ్ గ్రామ రైతులు అంజయ్య, జనార్దన్‌గౌడ్, దశరథ్, మహేశ్, నాగోజీ, రాములు, కళ్యాణ్, మోహన్ లాల్, నయీమ్ కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, మాజీ ఎంపీటీసీలు బొప్పిడిగోపాల్, ప్రియ రమేశ్ సందర్శించి దీక్షలో కూర్చున్న రైతులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, రాములు, పర్వత్ కుమార్ యాదవ్, వెంకట్‌రాజ్ గౌడ్, శ్రీనివాస్, పిప్పల్ల వెంకటేశ్, రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 12వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోలియో చుక్కల నిర్వహణపై వైద్య సిబ్బందికి అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబరు 12న కేంద్రాల్లో పోలియో చుక్కలు వేస్తారని, 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలను భాగస్వామ్యం చేసుకుని కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంవో డాక్టర్ మురారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శివ, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ పూర్ణిమ, గీత, విజయలక్ష్మి, నాగేంద్రబాబు, సుధ, ప్రోగ్రామ్ అధికారులు వినోద్, రాధిక, రాకేష్, పూనమ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

ఉప్పొంగిన వాగులు వంకలు

ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లాయి. చెక్‌డ్యాంలు అలుగు పారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఉమ్మడి జిల్లాను కలుపుకుని ఉన్న ఈసీ, మూసీ నదులు ఉప్పొంగాయి. యాచారం మండలం గున్‌గల్ ప్రాంతంలో అత్యధికంగా179.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



షాబాద్ : నాగర్‌గూడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

- జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు
- ఉధృతంగా ప్రవహించిన ఈసీ, మూసీ
- పలు చోట్ల రాకపోకలకు అంతరాయం
- అత్యధికంగా గున్‌గల్‌లో 179.3 మి.మీ నమోదు



చేవెళ్ల : ఆలూర్‌లో నిండుగా ప్రవహిస్తున్న వాగు

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/యాచారం/చేవెళ్ల/మంచాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేని వర్షానికి చేవెళ్ల మండలంలోని దేవరాంపల్లి వాగు, షాబాద్ మండలంలోని తాళ్లపల్లి, మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ వాగుతో పాటు శంకర్‌పల్లి మండలం ఫతేపూర్ వాగు ఉధృతంగా ప్రవహించాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వాగు పరివాహక ప్రాంతాల్లోని పత్తి, మొక్కజొన్న చేలల్లో వరదనీరు చేరి దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు జలమయంగా మారాయి.. గ్రామీణ రోడ్లన్నీ బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామం మీదుగా శంకర్‌పల్లి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న వాగు నిండుగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా

మిగతా 6వ పేజీలో...

జిల్లాలో వర్షపాత వివరాలు

మండలం	ప్రాంతం	నమోదు (మి.మీ.)
యాచారం	గున్‌గల్	179.3
అబ్దుల్లాపూర్‌మెట్	తాటి అన్నారం	121.0
హయత్‌నగర్	హయత్‌నగర్	112.5
హయత్‌నగర్	డిఫెన్స్ కాలనీ	102.3
అబ్దుల్లాపూర్‌మెట్	తొర్రూర్ జీపీ	94.5
మొయినాబాద్	కేతిరెడ్డిపల్లి	92.3
అబ్దుల్లాపూర్‌మెట్	పెద్దఅంబర్‌పేట్	75.5
శంకర్‌పల్లి	పొద్దుటూరు	74.0
యాచారం	యాచారం	74.0
యాచారం	నల్లవెల్లి	64.0
శంషాబాద్	పెద్దషాపూర్	60.8
ఇబ్రహీంపట్నం	మంగల్‌పల్లి	56.3
బాలాపూర్	ఎవియేషన్ అకాడమీ	53.8
నందిగామ	నందిగామ(పీహెచ్‌సీ)	53.0
మంచాల	ఆరుట్ల	51.5
కందుకూరు	మీర్‌ఖాన్‌పేట్	48.0



అవార్డును అందుకున్న జీఎంఆర్ ప్రతినిధులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు
అరుదైన గౌరవం

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు ఏసీఐ వరల్డ్ ఎయిర్‌పోర్టు కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాంలో లెవల్ -4 అక్రెడిటేషన్ అవార్డు దక్కిందని జీఎంఆర్ ప్రతినిధులు గురువారం తెలిపారు. లెవల్ 4 అక్రెడిటేషన్ సాధించడం తమ కార్యకలాపాల కేంద్రంలో ప్రయాణికులను ఉంచే అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ప్రయాణ అనుభవాన్ని మెరుగుపర్చేందుకు వ్యూహాత్మక పెట్టుబడులను ధ్రువీకరిస్తుందన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన గుర్తింపు దివ్యాంగులు, తక్కువ మొబిలిటి కలిగిన ప్రయాణికులతో పాటు అందరికీ మరింత సమగ్రమైన అందుబాటులో ఉండే గౌరవ ప్రదమైన ప్రయాణ అనుభవాన్ని కల్పించే మైలురాయిగా నిలుస్తుందన్నారు. అదే విధంగా 2025 మార్చిలో 2024 సంవత్సరానికి సంబంధించి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం 15 నుంచి 25 మిలియన్ ప్రయాణికులతో బెస్ట్ ఎయిర్‌పోర్టుగా అవార్డును అందుకున్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు
కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి
5

విద్యార్థులు వ్యవసాయంపై
అవగాహన పెంచుకోవాలి

జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ అన్నారు. స్వామి వివేకానంద సేవా బృందం, మైభారత్ పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం శంషాబాద్ మండలం గండిగూడలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో ఆమనగల్లు చెందిన వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం వ్యవసాయ రంగంలో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం బాటి అగ్రిఫార్మ్ నిర్వాహకులు రాజశేఖర్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ నిపుణులు బంకట్‌లాల్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు వెంకట్, సాయి, నిఖిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శివకుమార్

షాద్‌నగర్‌లో చిరుత కలకలం?

- భయాందోళనకు గురైన ప్రజలు
- అడుగులను పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని బాలాజీ టౌన్‌షిప్, సిరి సంపద వెంచర్‌లో గురువారం చిరుత పులి సంచరించినట్లు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం సిరి సంపద వెంచర్ మీదుగా బాలాజీ టౌన్‌షిప్ వైపు ఓ జంతువు రావడం గమనించిన కాలనీ వాసులు, దానిని మొదట చిరుత పులిగా భావించారు. దాంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న షాద్‌నగర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవీందర్, బీట్ ఆఫీసర్ వినోద్ కుమార్ తదితరులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. జంతువు అడుగులను గుర్తించి హైనా, లేదంటే అడవి పిల్లి కావొచ్చని అధికారులు తేల్చారు. ఇవి చిరుత అడుగులు కావని, ప్రజలు ఆందోళన చెందొద్దని అన్నారు.



గుర్తులను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు



మహేశ్వరం ఆదర్శ పాఠశాల

ఇదేమి ఆదర్శం?

స్కావెంజర్ల జీతాల్లో స్కాం

మహేశ్వరం మోడల్ స్కూల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధులు గోల్‌మాల్

మహేశ్వరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేద విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం, వసతుల కల్పనకు ప్రభుత్వాలు ప్రతీఏడాది కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే ఇలా కేటాయించిన నిధులు దుర్వినియోగం అవుతుండటంతో సర్కార్ లక్ష్యం నీరుగారిపోతోంది. మహేశ్వరం మండల ఆదర్శ పాఠశాలలో స్కావెంజర్ల జీతాల్లో స్కాం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూళ్లల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో కమిటీలను ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేకంగా ప్రతీనెల నిధులు విడుదల చేస్తుంది. ఈ కమిటీల్లో ఉన్న స్కావెంజర్లకు ప్రతీనెల రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ 2024 ఆగస్టు 2025 ఏప్రిల్ వరకు స్కావెంజర్లకు రూ.10వేలకు బదులు కేవలం రూ.6వేలు మాత్రమే చెల్లించి మిగతా డబ్బును 8 నెలలుగా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. 2024లో పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

మిగతా 6వ పేజీలో...

రూ.7వేలు మాత్రమే ఇచ్చారు

మోడల్ స్కూల్‌లో స్కావెంజర్‌గా విధులు నిర్వహించాను. నెలకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పి మూడు నెలల పాటు కేవలం రూ.7 వేలు ఇచ్చారు. మూడు నెలలకు పాఠశాల నుంచి రూ.21 వేలకు సంబంధించిన చెక్కు ఇచ్చారు. ఇదేమిటని అడిగితే నీకు ఇష్టం ఉంటే పని చెయ్యి.. లేదంటే మానుకో అని చెబుతున్నారు. నేను పని చేయడం మానేశా.. మాకు రావాల్సిన మరో 8 నెలల వేతనం ఇప్పించాలి.

- లక్ష్మయ్య స్కావెంజర్, మహేశ్వరం మోడల్ స్కూల్

మోసపూరిత హామీలతో అధికారంలోకి..

- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య రాజీనామా చేయాలి
- ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

షాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎరువుల సరఫరాలో దొంగాట ఆడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి ఆరోపించారు. గురువారం షాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి మాజీ ఐపీఎస్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. సబితారెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను కోటీశ్వర్లుగా మార్చుతానని చెబుతూ ఎరువుల కోసం వారినే క్యూలో నిలబెట్టే పరిస్థితి తీసుకువచ్చాడన్నారు. ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తుంటే పాత చెప్పులు లైన్‌లో పెడుతున్నారని మంత్రులు తప్పుడు మాటలు ప్రచారం చేస్తూన్నారన్నారు. పార్టీ మారని పీఏసీఎస్ చైర్మన్లకు నోటీసులు ఇచ్చి వేధిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ధైర్యం కాంగ్రెస్ పార్టీకి లేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఆర్ఎస్ పార్టీదే గెలుపన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.


యాదయ్య తక్షణమే రాజీనామా చేయాలి : ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

బీఆర్ఎస్ కార్యకర్తలు పోరాడి గత అసెంబ్లీ ఎన్నికల్లో యాదయ్యను గెలిపించారని, ఆయన పార్టీకి మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేవెళ్ల ప్రజలకు ముఖం చూపించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులను బదీలి చేయాలంటే రూ.30 లక్షలు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌లో రూ.12వేల కోట్ల మాదక ద్రవ్యాలను పట్టుకుంటే తెలంగాణ పోలీసులు మాత్రం కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మీద తప్పుడు కేసులు పెట్టడానికే సమయం కేటాయిస్తున్నారన్నారు. కాళేశ్వరం కూలి పోలేదని, కేసీఆర్‌ను బదనాం చేయడానికే బాంబులు పెట్టి పగుళ్లు ఏర్పడేలా చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కౌశిక్‌రెడ్డి, దేశమోళ్ల అంజనేయులు, రాజేందర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రభాకర్, శ్రీరాంరెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, చాంద్‌పాష, సత్యం, పాండు, మధుకర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్, కృష్ణగౌడ్, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దర్శన్, కవిత, నర్సింహారెడ్డి, రాజు, లక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి

పరిగి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇచ్చే పింఛన్లను రూ.4వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ పరిగి ఇన్‌చార్జి జి.రవికుమార్ కోరారు. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల కార్యాలయాల ముట్టడి విజయవంతానికి గురువారం పరిగిలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.







సైబర్ దాడుల ముప్పును సమష్టిగా ఎదుర్కొందాం

» కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు



హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): దేశంలో డిజిటల్ విప్లవం కొనసాగుతున్న సమయంలో సైబర్‌దాడుల ముప్పు పెరుగుతుందని, దీన్ని సమష్టిగా ఎదుర్కొందామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. రామంతపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(సీడీటీఐ)లో జరిగిన నేషనల్ పోలీసు హ్యాకథాన్ సైఫర్‌కాప్ 2025 అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీడీటీఐ త్రైమాసిక పత్రిక హోరిజన్‌ను అవిష్కరించి, హ్యాకథాన్ విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందచేశారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాల డైనమిక్ సవాళ్లను ఎదుర్కొవడం సమాజం ముందున్న ప్రధాన కర్తవ్యమని, వీటిని ఎదుర్కొవడంలో అందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

జైలు అధికారులే కీలకం

ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో జైలు అధికారుల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్యూటీ మీట్‌లో పలు విభాగాల్లో తెలంగాణ జైళ్ల శాఖ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన మెడల్స్, ట్రోఫీలు అందించారు. తెలంగాణ జైళ్ల శాఖ సొంతం చేసుకున్న ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా అందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ విధానాల్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. తెలంగాణలో జాతీయ ప్రిజన్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని బండి సంజయ్‌ను సౌమ్యా మిశ్రా కోరారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక జైళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని బీపీఆర్‌డీ అదనపు డీజీ రవి జోసెఫ్ లోకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, జాతీయ పోలీస్ శిక్షణా కేంద్రం డైరెక్టర్ అమిత్ గార్గ్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ ప్రతిభ

7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్‌లో అత్యధిక ట్రోఫీలు, మెడల్స్ సాధించి తెలంగాణ జైళ్ల శాఖ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 28 పతకాల్లో బంగారం-21, వెండి-4, కాంస్యం-3 ఉన్నాయి.

2017లోనే చిరునామా మార్పునకు ఫామ్-6 సమర్పణ : కోట నీలిమ

తనకు రెండు ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయని స్వతంత్ర సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసు ఇవ్వడమేమిటని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ ప్రశ్నించారు. ఓటరు గుర్తింపు కార్డులో తన చిరునామాను మార్చాలని కోరుతూ ఎన్నికల సంఘానికి 2017లోనే ఫామ్-6 ఇచ్చామని, దానికి ఈసీ అక్‌నాలెడ్జ్ కూడా ఇచ్చిందని గురువారం గాంధీభవన్‌లో మీడియాకు చెప్పారు. ఫామ్-6 సమర్పించిన తర్వాత కూడా తన చిరునామా మార్చని ఈసీ, రెండు ఓటరు గుర్తింపుకార్డులున్నట్లు నోటీసులివ్వడమేమిటన్నారు.

గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిందే

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు.. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామాకు డిమాండ్

» ఓయూ సహా పలుచోట్ల బీఆర్ఎస్వీ ఆందోళనలు, పలువురి అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, చిక్కడపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్వీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం, హైదరాబాద్, చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయం వద్ద వారు గురువారం ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ముఖ్యమంత్రి ఫొటోలను చింపేశారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో టీజీపీఎస్సీ విఫలమైనందుకు నైతిక బాధ్యతగా సీఎం రేవంత్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్వీ నేతలను పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ గ్రూప్-1 అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని లేని పక్షంలో తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకోవడంతో అభ్యర్థులు నిరుత్సాహానికి లోనవడంతో పాటు మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 29 ద్వారా చేపట్టిన నియామకాల వల్ల రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని నిరసనలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం లాఠీ చార్జీలు చేస్తుందని ధ్వజమెత్తారు.


బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మంత్రులు, సీఎంవో నుంచి గ్రూప్-1 పోస్టుల అమ్మకం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల కోసం ప్రభుత్వ పెద్దలు భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లు నిరుద్యోగులు చెబుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంత్రులు, సీఎంవో నుంచే గ్రూప్-1 పోస్టులను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారనే విమర్శలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం గ్రూప్ 1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్‌తో విచారణ చేపట్టి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని కోరారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని యువత ఎప్పటికీ క్షమించదని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక, బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఖండించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన రేవంత్‌రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అవకతవకలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు.

సిమ్ బాక్స్ ముఠా అరెస్టు

» అంతర్జాతీయ కాల్స్‌ను.. లోకల్ కాల్స్‌గా మారుస్తున్న ముఠా
» హాంగ్‌కాంగ్‌లో సూత్రధారి వెన్నీసా..

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అంతర్జాతీయ ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేసుకోవద్దని, మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని కేంద్ర,రాష్ట్ర సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తమ పంథాను మార్చారు. అంతర్జాతీయ కాల్స్‌ను స్థానిక కాల్స్‌గా మార్చే సాంకేతికతను వాడుతూ సిమ్ బాక్స్ డంపింగ్ ద్వారా ఎర వేయడానికి సన్నద్ధమయ్యారు. హాంగ్‌కాంగ్‌లో ఉన్న సైబర్ నేరగాళ్ల ముఠాలోని సూత్రధారి వెన్నీసా అనే మహిళ ద్వారా హైదరాబాద్, చాంద్రాయణగుట్టలలో సిమ్ బాక్స్ ఏర్పాటు చేసిన హిదయతుల్లా, అతనికి వందలాది సిమ్ కార్డులు ఇచ్చిన మరో ఇద్దర్ని సైబర్ సెక్యూరిటీ, కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖాధికారులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. కార్ల వ్యాపారం చేసే హిదయతుల్లా అందులో నష్టం రావడంతో స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తిని సంప్రదించాడు. అతనిచ్చిన సలహ మేరకు ఒక ట్రేడింగ్ యాప్‌లో రూ.16లక్షలు పెట్టుబడి పెట్టి మళ్లీ నష్టపోయాడు. దీంతో సదరు అగంతకుడు హిదయతుల్లాకు వాట్సాప్ ద్వారా హాంగ్‌కాంగ్‌లో ఉన్న వెన్నీసా అనే మహిళను పరిచయం చేశాడు. తమకు సాయం చేస్తే డబ్బు వచ్చేలా చేస్తామని వెన్నీసా పేర్కొనడంతో హిదయతుల్లా ఒప్పుకున్నాడు. ఒక సిమ్ బాక్స్‌ను పంపిస్తామని, స్థానికంగా సిమ్ కార్డులు సేకరించి, వైఫై కనెక్షన్ తీసుకుని దాని ఆపరేషన్ తమకు అప్పగించాలని వెన్నీసా సూచించడంతో హిదయతుల్లా సరే నన్నాడు. అతడికి కొరియర్ డెలివరీ బాయ్ ద్వారా అతనికి సిమ్ బాక్స్ అందింది. సిమ్‌కార్డుల కోసం వివిధ టెలికం కంపెనీల్లో పనిచేస్తున్న అహ్మద్‌ఖాన్, షోయబ్‌లను హిదయతుల్లా సంప్రదించాడు, వారు అందించిన 500 సిమ్ కార్డుల్లో 200 కార్డులను సిమ్ బాక్స్‌లో వేసి దాన్ని వెన్నీసా సూచించినట్లు హిదయతుల్లా పని చేయడం ప్రారంభించాడు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి అందిన ఫిర్యాదు ఆధారంగా రంగంలో దిగిన పోలీసు బృందాలు చాంద్రాయణగుట్ట నుంచి విదేశీ కాల్స్ రూట్ అవుతున్నట్లు గుర్తించి హిదయతుల్లాతో పాటు సిమ్‌లు అందచేసినవారిని పట్టుకున్నారు. వెన్నీసా గురించి దర్యాప్తు జరుపుతున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అదనపు డైరెక్టర్ అనురాగ్ తెలిపారు.

గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.వాణి నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదనపు వైద్య విద్య సంచాలకులుగా ఉన్న ఆమే, గతంలో మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా, గత సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఆమె బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆసుపత్రి పాలన గందరగోళంగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో రాజకుమారిపై సర్కారు వేటు వేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గాంధీ మెడికల్ కాలేజీలోనే ఫిజియోలజీ ప్రొఫెసర్‌గా కొనసాగుతారని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గొర్రెల స్కాం కేసులో ఈడీ దూకుడు

బాధితులను విచారించేందుకు నోటీసులు జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కొనుగోలు, బిల్లుల చెల్లింపు గోల్‌మాల్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగం పెంచింది. గొర్రెల స్కాంకు సంబంధించి ముందుగా కొందరు బాధితులు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో నిందితులుగా ఉన్న ప్రస్తుత, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులను అరెస్ట్ చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో బాధితులుగా ఉన్న వారిని విచారించి వాంగ్మూలం నమోదు చేసేందుకు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు సిద్ధమయ్యారు. ఏసీబీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా బాధితులకు నోటీసులు జారీ చేసి ఈ నెల 15న విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. మొదటి దశలో బాధితులను విచారించిన అనంతరం రెండో దశలో ఈ కేసులో ఏసీబీ అరెస్ట్ చేసిన వారికి సైతం నోటీసులు జారీ చేసి ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా గురుకుల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులా?

తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం ఖండన

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా ప్రిన్సిపాళ్లను బాధ్యులను చేయడం సరి కాదని తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కుమార్ రౌతు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో పూర్తిస్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు నిర్వహించలేదని, విద్యార్థులు తగ్గారంటూ రాష్ట్ర వ్యాప్తంగా 170 మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని ఖండించారు. ఎక్కువ గురుకుల పాఠశాలలు/ కాలేజీలు పెట్టి 100 శాతం ప్రవేశాలు చేయాలని కోరడం సబబు కాదని పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు.. చర్యలు తీసుకోవాలి


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు శివ, పవన్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు

శామీర్‌పేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట వద్ద రాజీవ్ రహదారిపై, నల్సార్‌కు వెళ్లే రోడ్డులో నిత్యం జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని శామీర్‌పేట మండల నాయకులు మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం నాయకులు శివ, పవన్‌గౌడ్, విష్ణు, శ్రీకాంత్, కిరణ్‌లు ఎంపీ రాజేందర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి రాజీవ్ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాజీవ్ హైవేపై సరైన సిగ్నల్స్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేక నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని, మరెందరో వికలాంగులుగా మారుతున్నారని ఎంపీకి చెప్పారు. ఈ హైవేపై ప్రమాదాలపై ఆయన వెంటనే స్పందించి చర్యలను తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీ స్పందిస్తూ.. శామీర్‌పేట వద్ద రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు తాను హైవే అథారిటీ అధికారులతో మాట్లాడతానని, తగిన చర్యలను తీసుకునేలా కృషి చేస్తానని చెప్పారు. అవసరమైన నిధులను ఎంపీ కోటా నుంచి మంజూరు చేస్తానని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పేట్ బషీరాబాద్ ఏసీపీకి ఎంపీ ఫోన్ చేశారు.

మునిసిపల్ కమిషనర్‌కు వినతి

బీజేపీ నాయకులు తూంకుంట మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ జ్యోతికి వినతిపత్రం ఇచ్చారు. రాజీవ్ హైవేపై ప్రయాణికులు రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా మునిసిపాలిటీ నుంచి నిధులు కేటాయించి అవసరమైన సర్వీస్ రోడ్లను, సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. యాక్సిడెంట్ స్పాట్లలో సిబ్బందిని ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణమాఫీ చేయాలంటూ రైతుల రిలే దీక్ష

● రైతులతో చర్చించిన జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

ఘట్‌కేసర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు వెంటనే పంటల రుణమాఫీ చేయాలని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం రెండో రోజుకు కొనసాగింది. రైతులు, రాజకీయ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రెండేళ్లయినా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ సొసైటీలో 1,190 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారని, వారిలో ఒక్కరికి కూడా రుణమాఫీ చేయలేదన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్ష వద్దకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ వచ్చి చర్చించారు. రుణమాఫీ కోసం రైతులు జాబితాను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. నాలుగో విడతలో మిగిలిపోయిన రైతులందరికీ రుణమాఫీ వర్తించే అవకాశముందని చెప్పారు. ఆమెతో ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, ఏఓ లావణ్య, ఏఈవో జగదీష్ ఉన్నారు.


గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట


ఆలూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానికులు

● చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆలూర్, తంగడ్‌పల్లి గ్రామాల్లో ఎంపీ నిధులతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపీ ల్యాడ్స్‌తో సీసీ రోడ్లు, యూజీడీ పనులను చేపడుతున్నట్లు చెప్పారు. దశలవారీగా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, జిల్లా, మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎ.అనంతరెడ్డి, డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణ, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, జయసింహరెడ్డి, అల్లి శ్రీశైలం, నాగరాజు, వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యంతరం తెలిపినా పోలింగ్ స్టేషన్ మార్చలేదు


పీఎస్ మార్చాలని కోరుతూ ఇచ్చిన వినతి పత్రం

ధారూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధారూరు పోలింగ్ స్టేషన్‌ను అనుకూలమైన చోటకు మార్చాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చినా మార్చలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్‌లకు కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ బాబా ఖాన్ గురువారం ఫిర్యాదు చేశారు. అభ్యంతరాలపై ఈ నెల 8న మండల పరిషత్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ధారూరు పోలింగ్ కేంద్రాన్ని బాలుర పాఠశాల నుంచి బాలికల పాఠశాలకు మార్చాలని కోరామన్నారు. ప్రస్తుత పోలింగ్‌స్టేషన్ గ్రామానికి దూరంగా ఉందని తెలిపారు. సౌకర్యంగా ఉన్న బాలికల పాఠశాలకు మార్చాలని వినతి పత్రం ఇచ్చామన్నారు. తమ అభ్యంతరాన్ని పరిగణలోకి తీసుకోలేదన్నారు. దీంతో ఎస్ఈసీ, కలెక్టర్‌లకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణపై అభ్యంతరాలను అధికారులు పట్టించుకోలేదని నాయకులు మండిపడుతున్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం గద్దె దిగాలి


శుభప్రద్ పటేల్

పెద్దేముల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా అందించడం లేదని, రైతులను ఆదుకోని ప్రభుత్వం గద్దె దిగాలని రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ.. పెద్దేముల్, యాలాల మండలాల్లో రైతులు యూరియా కోసం వర్షంలో ఇబ్బందులు పడిన పరిస్థితులను సోషల్ మీడియాలో చూసి చలించిపోయానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్నదాతలు పంటల సాగుకు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క బస్తా యూరియా కోసం వర్షంలో నిలబెట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ యూరియా కష్టాలు రాలేదన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


గుండ్లపోచంపల్లిలో అక్రమంగా నిర్మిస్తున్న గోదాం

అక్రమ గోదాంలపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ రెండో వార్డులో అక్రమంగా నిర్మిస్తున్న గోదాంలపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎండీఏ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూడూరులో సర్వే నంబర్లు 439/2, 440, 441, 442లలో కొందరు అనుమతి లేకుండా గోదాంలు కడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని.. అందుకే హెచ్ఎండీఏ, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్పీకర్‌ను విమర్శించే స్థాయి ఆనంద్‌కు లేదు

మర్పల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు లేదని కాంగ్రెస్ నాయకులన్నారు. మర్పల్లి మార్కెట్ యార్డులో గురువారం విలేకరులతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు కృష్ణారెడ్డి, రవీందర్, రామేశ్వర్, రఫీయోద్దీన్‌లు మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే ఆనంద్ చీటికి మాటికి స్పీకర్‌ను విమర్శిస్తున్నారని, ఇలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలోనే చేసి చూపామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసిందన్నారు. సమావేశంలో నాయకులు నాగేశ్, దివాకర్, సురేశ్, సంజురెడ్డి, జగదీశ్వర్, ఈశ్వర్, పాండురంగారెడ్డి, సర్వేశ్ పాల్గొన్నారు.


ఏఐ క్లౌడ్‌బూట్ క్యాంప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

అనురాగ్‌లో ఏఐ క్లౌడ్‌బూట్ క్యాంప్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్‌లో గల అనురాగ్ యూనివర్సిటీలో గురువారం గూగుల్ క్లౌడ్, హ్యాక్ టు స్కిల్ సహకారంతో గూగుల్ ఏఐ క్లౌడ్‌బూట్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపును రెండు సెషన్లలో నిర్వహిస్తున్నామని డీన్ విజయ్‌కుమార్ తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ డొమైన్‌పై సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ విష్ణుమూర్తి, బూట్‌క్యాంప్ కో-ఆర్డినేటర్లు సిద్ధార్థ్ ఘోష్, తరానాసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహల వల్ల జరిగే నష్టాల గురించి గురువారం షీటీం బృందం సభ్యులు అవగాహన కల్పించారు. పట్టణంలోని విజ్ఞాన్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే 1098కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది సురేష్ కుమార్, శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్, ప్రిన్సిపాల్ భవానీ శంకర్ ఉన్నారు.

జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ టోర్నీకి ఎంపిక

బంట్వారం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 69వ ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ గురువారం తెలిపారు. మర్పల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన క్రీడల్లో తమ స్కూల్ బాలికలు వాలీబాల్‌లో బాలికలు ద్వితీయ బహుమతి సాధించారన్నారు. అండర్-17లో మహేశ్వరి, గాయత్రి, సంధ్య, అండర్-14లో శ్రీనవ్య, భవిత, నందిని, శ్రీవాణి జిల్లా పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను కేజీబీవీ టీచర్లు అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా కేసు .. ఎయిర్‌పోర్టులో

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్టు

మునావర్‌ను కువైట్ నుంచి హైదరాబాద్‌కు రప్పించిన సీబీఐ

ఫిబ్రవరి 2న రెడ్ కార్నర్ నోటీసుల జారీ


మునావర్ ఖాన్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా మోసం చేసిన కేసులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ మహ్మద్ మునావర్ ఖాన్‌ను గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. 2011లో చెన్నైలో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లో అదే ప్రాంతానికి చెందిన మునావర్‌ఖాన్ నకిలీ పత్రాలు సృష్టించి కోట్లాది రుపాయలు కొల్లాగొట్టి కువైట్‌కు పరారయ్యాడు. అప్పట్లో సీబీఐ అధికారులు కువైట్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో విచారణ అనంతరం కువైట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 2011 నుంచి తప్పించుకుంటున్న మునావర్‌ను కువైట్ పోలీసుల సహకారంతో సీబీఐ అరెస్టు చేసి ఇండియాకు రప్పించింది. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరిన అతడిని సీబీఐ అరెస్టు చేసి చెన్నైకి తరలించింది. కాగా మునావర్‌పై గత ఫిబ్రవరి 2న దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది.

సీఎం రేవంత్‌ను కలిసిన శ్రీను



ఆమనగల్లు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా నాయకుడు, పద్మశాలి సంఘం రాష్ట్ర నేత అప్పం శ్రీను గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశా రు. ఉన్నత విద్యకు యూకేకు వెళ్తున్న అప్పం శ్రీను కూతురు అప్పం రుషిశ్రీని ఈ సందర్భంగా సీఎం ఆశీర్వదించారు.

పద్మనాభ స్వామిని దర్శించుకున్న గోలి

ఆమనగల్లు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జిల్లా అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. కమిషన్ సభ్యులతో కలిసి స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో శ్రీనివా స్‌రెడ్డిని నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


గోలి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం పల్లెచెలుక తండాకు రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ ద్వారా నిధులు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఇతర వసతుల కల్పనకు రూ.5కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపగా మొదటి విడత రూ.కోటి విడుదల చేశారని పేర్కొన్నారు. పల్లె చెలుక తండా వాసులు గురువారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు రమేశ్‌నాయక్‌లతో ఎమ్మెల్యేను హైదరాబాద్ లో కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. తండా అభివృద్ధిపై నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని తండాలకు బీటీ రోడ్లు వేస్తామని నారాయణరెడ్డి చెప్పారు. అన్ని తండా పంచాయతీలకు భవనాలు నిర్మిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం అన్నిరంగాల్లో ప్రగతి సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు రమేశ్‌నాయక్, నర్సింహనాయక్, శ్రీను, సీతారామ్, దీప్లా, బాల్‌దాస్, మన్య, మోతిలాల్, రవీందర్, గోపి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కమలమ్మకు ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లుకు చెందిన జూలూరి కమలమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి గురువారం ఆసుపత్రికి చేరుకొని కమలమ్మను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆమె కుమారులు జయప్రకాశ్, రమేశ్, అశోక్, గోపాల్, సురేశ్‌లను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని కమలమ్మకు మనోధైర్యం చెప్పారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

రైతులను వీడని యూరియా కష్టాలు


పెద్దేముల్ : బారులు తీరిన రైతులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 11: యూరియా కోసం రైతులు పలు అగచాట్లు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులకు యూరియా కష్టాలు అధికమయ్యాయి. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా లభ్యం కాక ఇక్కట్లు తప్పడం లేదు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది యూరియా కష్టాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పనులను మానుకుని యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడ్డారు.

కులకచర్లలో ఎస్సై కాళ్లు మొక్కిన రైతు

కులకచర్ల చౌరస్తాలో యూరియా కోసం రైతులు ధర్నా చేశారు. తనకు యూరియా ఇప్పించాలని ఓ రైతు ఎస్సై కాళ్లు మొక్కాడు. యాలాల, పెద్దేముల్ సొసైటీకి 220బస్తాల యూరియా వచ్చింది. ఉదయమే 300మంది రైతులు బారులు తీరారు. 9గంటలకు వర్షం కురియగా వానలోనే నిలబడ్డారు. ఒక్కొక్కరికి ఒక్కోబస్తా ఇచ్చారు. అందని వారికి స్లిప్పులు రాసిచ్చారు. మోమిన్‌పేట్‌లో సొసైటీ కార్యాలయం ఎదుట టోకెన్ల కోసం చెప్పులను లైన్లోపెట్టి ఎదురు చూశారు. పూడూరు మండలం చెన్గోముల్ రైతు వేదిక వద్ద క్యూలో నిలబడ్డారు. ఒక్కొక్కరికి రెండుబస్తాల చొప్పున ఇచ్చారు. యాలాలలో వ్యవసాయ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు లైన్‌లో నిలబడ్డారు. ధారూరు మండలం రుద్రారం-నాగసమందర్‌ల మధ్య ఉన్న అలుగు పొంగడంతో ధారూరు ప్యాక్స్ సిబ్బంది నాగసమందర్‌కు వెళ్లలేకపోయారు. దీంతో అక్కడ యూరియా సరఫరా నిలిచింది.కోట్‌పల్లికి లారీలో వచ్చిన యూరియా బస్తాలన్నీ దింపాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. యూరియా బస్తాలను కింద పడవేశారు. ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుల ప్రోద్బలంతోనే ఇలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కులకచర్లలో యూరియా కోసం ఎస్సై కాళ్లు మొక్కుతున్న రైతు

రంగారెడ్డి జిల్లాలో...

యాచారంలో సొసైటీ కార్యాలయం వద్ద యూరియా పంపిణీ చేశారు. రైతులకు ఏసీపీ కేపీవీ రాజు, సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై ప్రియాంక స్లిప్‌లు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇచ్చారు. రైతులకు వెంటనే యూరియా అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచాలలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నాయకులు ఎం.బాలయ్య, ఎస్.శ్రీనివాస్, చంద్రయ్య, పి.నీలమ్మ, అలీమొద్దీన్, ఎల్.అనంతరెడ్డి, రాజు, బి.బాలయ్య, ఎస్.బాల్‌రెడ్డి, నరేందర్, ఎల్లేశ్, రామకృష్ణ పాల్గొన్నారు. యూరియా కోసం రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, మందే టోకెన్లు ఇచ్చి క్రమపద్ధతిలో పంపిణీ చేయడం అభినందనీయమని మహేశ్వరం ఏసీపీ జానకిరెడ్డి అన్నారు. కందుకూరులో ఏవో లావణ్య, సీఐ సీతారాం ఆధ్వర్యంలో రెండు లారీల యూరియా పంపిణీ చేపట్టారు. ఏసీపీ చేరుకొని పర్యవేక్షించారు. ఎస్ఐలు పరమేశ్, సురేశ్, సొసైటీ సీఈవో యాదగిరిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మాడ్గుల మండల రైతులకు యూరియా సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషకు మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సూదిని శ్రీనివాస్‌రెడ్డి, జగన్ ఉన్నారు. చేవెళ్లలో యూరియా కోసం డీసీఎంఎస్ గోదాం వద్ద రైతులు బారులు తీరారు. 450 బస్తాల యూరియా రాగా ఏవో శంకర్‌లాల్, సొసైటీ సీఈవో వెంకటయ్య రైతులకు పంపిణీ చేశారు.


చేవెళ్లలోని డీసీఎంఎస్ గోదాం వద్ద యూరియా కోసం క్యూ


యాలాలలో వ్యవసాయ కార్యాలయం వద్ద వర్షంలోనే నిల్చున్న రైతులు


కందుకూరు : పంపిణీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీపీ జానకిరెడ్డి

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

» జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

కొందుర్గు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలని సూచించారు. కూలీల డబ్బుల వెంటనే చెల్లించాలన్నారు. మాస్టార్‌లను తనిఖీ చేయకుండా బిల్లులు ఇవ్వొద్దన్నారు. వనోమహోత్సవంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ మేరకు గ్రామాల్లో మొక్కలు నాటించాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్ఐవో సుభాషిణి, సునీత, క్లస్టర్ ఏపీడీ చరణ్‌గౌతమ్, ఎంపీడీవో లక్ష్మిఅనురాధ, ఎంపీవో విజయ్ కుమార్ పాల్, ఏపీవో నర్సింగ్ రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన

పరిహారం చెల్లించాలి


ఆందోళనలో మాట్లాడుతున్న ఆచారి

మాడ్గుల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నెబోయినిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ట్రిపుల్‌ఆర్‌కు భూములు కోల్పోయే రైతులకు సరిపడా పరిహారమివ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజి ఆచారి అన్నారు. గురువారం మాడ్గులలో రైతులు రాస్తారోకో చేశారు. భూములు లాక్కొంటూ తమ నోట్లో మట్టికొడుతున్నారని రైతులు వాపోయారు. ట్రిపుల్‌ఆర్‌ను పాత అలైన్మెంట్ ప్రకారమే నిర్మించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారికి మద్దతుగా ఆచారి పాల్గొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇస్తానంటున్న ఎకరానికి రూ.8లక్షలు సరిపోవని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. రైతులు తహసీల్దార్‌కు వినయసాగర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు నరోత్తమ్‌రెడ్డి, ఎ.రాంరెడ్డి, సంజీవ రెడ్డి, శివరాంరెడ్డి, వెంకటయ్య, శేఖర్, బీజేపీ మండల అధ్యక్షులు పెద్దయ్య, కాటంగౌడ్ పాల్గొన్నారు.


కార్మికుల వేతనాలు

వెంటనే చెల్లించాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి


ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

చౌదరిగూడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మిక సంఘం నాయకులు, జీపీ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని ఎంపీవో హన్మంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీనెల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీరేష్, రమేష్, యాదగిరి, తిర్మలేష్, శంకర్, పాపయ్య, జంగయ్య, పార్వతమ్మ, రాములమ్మ, నర్సమ్మ, సరళ, చెన్నమ్మ పాల్గొన్నారు.


నూతన కమిటీని సన్మానిస్తున్న దశరథ్‌నాయక్

20వేల మందితో బంజారాల బహిరంగ సభ

కడ్తాల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బంజారాల బలం చాటేలా కల్వకుర్తి నియోజకవర్గంలో త్వరలో 20వేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బంజరాలంతా ఏకమై స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కడ్తాల్ మండలం మైసిగండిలో గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మైసిగండి పంచాయతీ ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్‌నాయక్, గానుమర్ల తండా అధ్యక్షుడిగా కిషన్‌నాయక్, పెద్దవేములోని బాయి తండా అధ్యక్షుడిగా కొర్ర శ్రీనునాయక్, గడ్డమీది తండా అధ్యక్షుడిగా శ్రీనునాయక్‌లు ఎన్నికయ్యారు. అనంతరం దశరథ్ మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ జనాభాలో 35శాతం ఉన్న బంజారాలు ఏకమైతే ఎన్నికేదైనా విజయం మనదేనన్నారు. అన్ని గ్రామాల్లో ఎల్‌హెచ్‌పీఎస్ కమిటీలను నియమించి బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల ప్రముఖులనూ ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తులసి రామ్‌నాయక్, శ్వేతా భూనాథ్ డైరెక్టర్ సేవ్యనాయక్, మాజీ ఉప సర్పంచ్ శారద పాండు, రమణనాయక్, నాయకులు శ్రీను, లక్ష్మణ్ నాయక్, సోమ్లానాయక్, భీమనాయక్, మోతిలాల్, రాజు, రాజశేఖర్, జగన్, తేజు హరి, నాగేశ్, బన్సీలాల్, రమేశ్, గణేశ్, సరియా రవి, దత్తు, మల్లేశ్, శ్రీకాంత్, రాజేశ్, నరేశ్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు అందజేసి చెక్కు ఇస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాతాపితరుల ఆశ్రమంలోని వృద్ధులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ వనస్థలిక్రాంతి వారు గురువారం 50 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ కిషోర్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా తమ వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మాతాపితరుల సేవ సదన్‌కు రూ.5వేల ఆర్థికసాయం చేశామన్నారు. కార్యక్రమంలో సాధు శ్యాంప్రసాద్, సంధ్యరాణి, గోవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, భాస్కర్ రావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

(మూడో పేజీ తరువాయి)

ఏర్పడిన గుంతల్లో లోడ్‌తో ఉన్న లారీ దిగబడింది. యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లో రెండు గంటల పాటు వాన దంచి కొట్టింది. వర్షం కారణంగా యాచారం మండల కేంద్రంలో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. చౌదర్‌పల్లిలో పంటపొలాలు, శ్మశాన వాటికల నుంచి భారీగా వరద నీరు గ్రామంలోకి ప్రవేశించడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం నీరు ఎస్సీ కాలనీ నుంచి పంటపొలాల్లోకి చేరింది. యాచారం మండలంలోని గున్‌గల్‌లో ఆవ ఐలయ్య వెంచర్ సమీపంలో మేకపోతు, గొర్రెపొట్టేలు, గేదె దూడలను కట్టేశాడు.


చేవెళ్ల : ఆలూర్‌లో వర్షం వల్ల గుంతలో దిగబడిన లారీ


మంచాలలో కురుస్తున్న వర్షం

వర్షం కారణంగా ప్రహరీ కూలి అవి మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ. రెండున్నర లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

మంచాలలో మోస్తరు వర్షం

మంచాల మండల పరిధిలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల కురిసిన వానలకు మంచాల మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మండల పరిధిలో వివిధ గ్రామాలకు సంబంధించి మొత్తం 14 వేల ఎకరాలు సాగు భూమి ఉండగా, ఖరీఫ్ (వానాకాలం సీజన్)లో సుమారు 6వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. ఇందులో 4వేల ఎకరాల్లో వరి, పత్తి 1200 ఎకరాలు, జొన్న 500 ఎకరాలు, కూరగాయలు 500 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. కాగా 15 రోజులుగా వానల జాడే లేకపోవడంతో మెట్టపంటలు ఎండు ముఖం పట్టాయి. తాజాగా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


యాచారం మండలం గున్‌గల్‌లో వెంచర్ ప్రహరీ కూలీ మృత్యువాతపడిన గేదె దూడ


కొత్తూర్‌లో కురుస్తున్న వర్షం

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు


మొయినాబాద్/చేవెళ్ల : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్/చేవెళ్ల/ఆమనగల్లు/మాడ్గుల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మొయినాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు, విద్యారంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీడీవో సంధ్య, ఎంఈవో మల్లయ్య. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజుగౌడ్, మహేందర్‌ముదిరాజ్, పోచయ్య, వివిధ గ్రామాల టీచర్లు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురుపూజోత్సవం పురస్కరించుకొని చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఈశ్వరీహాల్‌లో చేవెళ్ల మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల స్థాయిలో 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా.. సన్మానించి వారికి జ్ఞాపికలందజేశారు. అనంతరం మాట్లాడుతూ చేవెళ్ల మండలంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. తొందరలోనే స్థలం పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. ఈ కా ర్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఎంఈవో పురందాస్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుసూదన్ గుప్తా, రాజశేఖర్, నర్సింలు, పార్టీ సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ సమాజాభ్యుదయ నిర్మాణానికి, మార్పుకు గురువే గొప్ప మార్గదర్శి అని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు కేజీబీవీలో గురువారం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న ధనలక్ష్మిని పాపిశెట్టి రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరై శాలువాలతో సత్కరించారు. పాఠశాల ఎస్‌వో పద్మజ్యోతి, శృతిలయ కల్చరల్ అకాడమీ ప్రధాన కార్యదర్శి వనం విజయ్‌కుమార్, శ్రీను నాయక్, భాస్కర్, ఉపాధ్యాయినీలు ఉన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో సర్దార్‌నాయక్ తెలిపారు. ఈమేరకు వారిని సన్మానించారు. మాడ్గుల, ఇర్విన్, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలు సుదర్శన్, పర్వతాలు, కొల్కులపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సువర్ణ, లక్ష్మిలు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ధనలక్ష్మిని సన్మానిస్తున్న రాము



మాడ్గుల : సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఈవో సర్దార్‌నాయక్


బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ కాంచనలత తదితరులు

పట్టుదలతో చదవాలి

చేవెళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత తెలిపారు. గురువారం కళాశాల ఆవరణలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు. విద్య అనేది భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఎస్‌ఏపీ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దేవకీదేవి, అధ్యపకులు రమేశ్‌బాబు, మాలిక్, ఎ.కవిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కడ్తాల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో 20టన్నుల యూరియా సరఫరాకు సిద్ధంగా ఉందన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ సబ్‌సెంటర్‌ను గురువారం సందర్శించారు. యూరియా సరఫరాను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. టోకెన్లు అందజేసి యూరియా పంపిణీ చేస్తామన్నారు.

క్రైం కార్నర్

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రిలో ఘటన

కొందుర్గు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భార్యను హతమార్చాడు ఓ భర్త. ఈ సంఘటన గురువారం కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన ప్రకారం.. రేగడిచిల్కమర్రి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, జయమ్మ దంపతులకు 30ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉండగా ఇద్దరికీ వివాహం జరిగింది. అయితే, ఇటీవల జయమ్మ తమ సమీప బంధువుతో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త వెంకట్‌రెడ్డి అనుమానం పెంచుకున్నాడు. ఈక్రమంలో తరచూ గొడవ పడుతుండేవారు. నిత్యం తనతో గొడవ పడుతున్నారని తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నారంటూ జయమ్మ తన సోదరుడికి సమాచారమిచ్చింది. దాంతో అతడు అక్కాబావలకు సర్దిచెప్పి కలిసి మెలిసి ఉండాలని కోరాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి తిరిగి భార్యభర్తలు తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. సహనం కోల్పోయిన వెంకట్‌రెడ్డి తన భార్య జయమ్మను విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రగాయాలై మృతిచెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించినట్లు ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు.


జయమ్మ (ఫైల్)

లైంగికదాడి కేసులో నిందితుల రిమాండ్

యాచారం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని నందివనపర్తికి చెందిన జి.క్రాంతికుమార్(27) బి.క్రాంతి(24)లు ఓ బాలికపై ఇటీవల లైంగికదాడికి పాల్పడ్డారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం నిందితులను అరెస్టు చేశారు. ఈమేరకు ఆ ఇద్దరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, పోక్సో బీఎన్‌ఎస్ యాక్ట్‌ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ కేపీవీ రాజు మీడియాకు వెల్లడించారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి!

కొందుర్గు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెరువులో జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన కొందుర్గు మండలం వెంకిర్యాలలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్‌నాయక్ కథనం మేరకు.. కొందుర్గు మండలం లక్ష్మీదేవిపల్లి పరిధి దర్గ్యానాయక్ తండాకు చెందిన రాము లునాయక్(65) శుక్రవారం వెంకిర్యాల గ్రామసంతలో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి కాలినడక బయలుదేరాడు. ఈక్రమంలో సమయంలో చెరువులో జారిపడటంతో మృతిచెందారు. గుర్తించిన గ్రామస్తులు పో లీసులకు సమాచారం అందించగా.. చెరువులోంచి మృతదేహాన్ని బయటకు తీసి షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రాములు నాయక్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.


రాములు (ఫైల్)


పామెనలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

చేవెళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యమని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. గురువారం చేవెళ్ల మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని ఎన్కెపల్లి, ఈర్లపల్లి, సింగప్పగూడ గ్రామాలతోపాటు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని చేవెళ్ల, మల్కాపూర్, పామెన తదితర గ్రామాల్లో కలిపి మొత్తం రూ.3కోట్ల 20లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే భూమి పూజ, శంకుస్థాపనలు చేశారు. పనులు తొందరలోనే పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కమిషనర్ వెంకటేశం, పీఆర్ డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, రాజశేఖర్, నర్సింలు, మధుసూదన్‌గుప్తా, మాజీ ఎంపీటీసీలు వసంతం, రాములు, రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్లు పాండుయాదవ్, లక్ష్మారెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోపాల్, విజయ్, యాదయ్యగౌడ్, గంగి యాదయ్య, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

దోపిడీ వ్యవస్థను అరికట్టాలి : బక్కని


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ దోపిడీ వ్యవస్థను అరికట్టకపోతే నేపాల్‌కు పట్టిన గతే తెలంగాణకు పడుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ భూమి కోసం, ముక్తి కోసం, మాతృదేవ విముక్తి కోసం వినోబాభావే లాంటి వ్యక్తులు భూదాన్ ఉద్యమాలు చేపట్టారని, నేడు రియల్ వ్యాపారంతో భవిష్యత్తు తరాలకు భూములేలేకుండా చేస్తున్నారని, పచ్చని వ్యవసాయ పొలాలను ఇంటి స్థలాలుగా మారుస్తుంటే.. పంటలు ఏమవుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు కూడా అధికారుల అండదండలతో కొందరు రూపురేఖలను మారుస్తుంటే.. పర్యావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవాలన్నారు. వినోబా భావే, బూర్గుల రామకృష్ణారావు, లంకాల నారాయణరెడ్డి, తదితరులు భూదాన్ ఉద్యమం చేపట్టి సుమారు 10 వేల ఎకరాలను పేద ప్రజలకు పంచిన విషయాన్ని గుర్తుచేశారు. గత పాలకులు ధరణి పోర్టల్ తీసుకొచ్చిన తరువాత భూముల ధరలకు రెక్కలొచ్చాయని, విచ్చలవిడిగా ప్రభుత్వ భూములు ఇతరులకు ధారాదత్తమయ్యాయని తెలిపారు. దీంతో వ్యవసాయ పొలాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్నాయని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో అడ్డగోలు వ్యాపారాలు చేయరాదని.. ఆ పాపం ఊరికే పోదని బక్కని అన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

కడ్తాల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గమని సీఐ గంగాధర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 13 వరకు జరిగే లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలనే దిశగా పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నేరరహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని కడ్తాల్ సీఐ గంగాధర్ అన్నారు. కడ్తాల్ మండలం చరికొండలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక నాయకుడు పాలకూర్ల మహేందర్ రూ.21 వేలు విరాళం ప్రకటించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో అందించారు. మహేందర్‌ను సన్మానించి అభినందించారు. ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్సై బాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, పీసీ శివదత్తు ఉన్నారు.

నందిగామ : రాజీమార్గమే రాజమార్గమని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సూచించారు. ఈ నెల 13న షాద్‌నగర్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నందు లోక్‌అదాలత్ నిర్వహించబడుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కడ్తాల్ : మాట్లాడుతున్న సీఐ గంగాధర్

బీసీ బిల్లుకు మోకాలడ్డుతున్న కేంద్రం

● పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్

కడ్తాల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల బిల్లును వెంటనే ఆమోదించాలని టీపీసీసీ సభ్యుడు, గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బీసీల శ్రేయస్సును కాంక్షించి సీఎం రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు బిల్లు తీసుకువచ్చి అసెంబ్లీలో ఆమోదించడం జరిగిందని, కేంద్రం మాత్రం మోకాలడ్డుతోందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం విలేఖరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, నాయకులు బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

జీవాలకు టీకాలు వేయించాలి

చేవెళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జీవాలకు టీకాలు వేయించుకోవాలని, గ్రామాల్లో ఏర్పాటు చేసే పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల డివిజన్ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం చేవెళ్ల మండలంలోని ఎన్కెపల్లిలో శ్రీసత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 16 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేసి మందులు అందించారు. ఇతర జీవాలకు నట్టల నివారణ టీకాలు వేసి మందులిచ్చారు. పశువైద్యాధికారి దేవేందర్‌రెడ్డి, సత్యసాయి ట్రస్టుసభ్యులు రామన్న, గోపాల్, రాజేశ్, తదితరులున్నారు.

నేడు మండల స్థాయి టీఎల్‌ఎం మేళా

కొత్తూర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నేడు(శుక్రవారం) టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అంగోర్‌నాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు తయారుచేసే బోధనా సామగ్రిని టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన టీచర్లు, విద్యార్థులు మేళాను పరిశీలిస్తారని, గెలుపొందిన పాఠశాలలను మొదటి, ద్వితీయ విజేతలుగా ప్రకటించి, జిల్లాకు ఎంపిక చేయడం జరుగుతుందని ఎంఈవో పేర్కొన్నారు.

ఇదేమి ఆదర్శం?

(మూడో పేజీ తరువాయి)

స్థానిక గ్రామ పంచాయతీలోని మహిళా సంఘం అధ్యక్షురాలి తోపాటు ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారు.

కమిటీ నిధులు, విధులు

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన వాటి నిర్వహణ తోపాటు విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం సమకూర్చాల్సిన బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం, పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడానికి చర్యలు తీసుకోవడం, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం, నిధుల నిర్వహణ పర్యవేక్షణ తదితర కార్యకలాపాలు కమిటీ చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా పాఠశాలలో నిధుల వినియోగం మౌలిక వసతుల కల్పన, మైనర్ రిపేర్లు, సామగ్రి కొనుగోలుకు ప్రత్యేక నిధులు విడుదలవుతాయి. మహేశ్వరం మోడల్ స్కూల్లో మొత్తం 825మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కావెంజర్ల జీతాల కోసం గత ఏడాది ఆగస్టు నెల నుంచి నెలకు రూ. 20 వేల చొప్పున ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతున్నాయి. మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాత్రం కమిటీ అనుమతి లేకుండా ఇష్టానుసారంగా కేవలం ఇద్దరు వ్యక్తులను స్కావెంజర్లుగా నియమించారు. వారికి గత సంవత్సరం ఆగస్టు నుంచి ఒక్కొక్కరికి నెలకు కేవలం రూ.7వేలు మాత్రమే చెల్లించి నిబంధనలకు విరుద్ధంగా ప్రతీనెల రూ.6 వేలు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రిన్సిపాల్ ఏకపక్ష నిర్ణయాలతో స్కావెంజర్లు విధులను పూర్తిగా మానేశారు. 850 మంది విద్యార్థులతో పాటు అక్కడ పని చేసే ప్రతీ ఒక్కరికీ ఆదర్శంగా ఉండాల్సిన ప్రిన్సిపాల్ ఇలా నిధుల దుర్వినియోగానికి పాల్పడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్కావెంజర్ల నిధులను కాజేసిన విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తమకు రావాల్సిన 8 నెలల వేతనాలను ఇప్పించాలని బాధిత స్కావెంజర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

గోల్‌మాల్ ఏమీ జరగలేదు

నిధుల గోల్‌మాల్ ఏమీ జరగలేదు. ఇక్కడి పనిచేస్తున్న స్కావెంజర్లకు వేతనాలు చెల్లిస్తూనే ఉన్నాం. నేను ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకొని సంవత్సరం కావొస్తుంది. గతంలో ఏమైనా బకాయిలు ఉన్నాయేమో తెలియదు. అయితే, సంవత్సర కాలం నుంచి మాత్రం తాము స్కావెంజర్లుగా పని చేస్తున్న వారికి వేతనాలు చెల్లిస్తున్నాం.

గోపి, మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

జిల్లా స్థాయి 'కళా ఉత్సవ్' పోటీలకు నవజీవన్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

షాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కళా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పాటలు, నృత్య పోటీల్లో షాబాద్ నవజీవన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేఘన, మెహక్, దివ్యశ్రీ, ఎస్తేర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈమేరకు వారు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులను ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

సంక్షిప్తంగా..

కడ్తాల్ : యువత స్వశక్తితో ఎదిగి సమాజంలో ఆదర్శంగా నిలువాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాలలో దీపిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు.

కేశంపేట : సంగెం గ్రామానికి చెందిన కడారి నర్సమ్మ గురువారం మృతిచెందింది. మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలా శ్రవణ్‌రెడ్డి మృతురాలి కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5వేలు అందించారు. అలాగే బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి రూ.5వేలు, వేణుగోపాలచారి రూ.2వేలు అందించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

కందుకూరు : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుడ్డీరవు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్మికుల మహాసభను ఆ సంఘం మండల శాఖ అధ్యక్షురాలు కె.ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యాధికారి హెచ్.నర్సింహకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు అప్పు తెచ్చి స్కూల్ పిల్లలకు వండిపెడుతున్నారని, బిల్లులు మాత్రం మంజూరు చేయడంలో ప్రభుత్వం ఎందుకు వివక్ష చూపుతుందని అన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి


ముచ్చర్లలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్.సురేందర్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని సాయిరెడ్డిగూడ, ఉట్లపల్లి, ముచ్చర్ల గ్రామాలలో మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి భయపడుతున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి కనీసం 20శాతం కూడా నెరవేర్చకపోవడమే దీనికి కారణమన్నారు. డీసీసీ డైరెక్టర్ ఆనంద్, రాముగుప్తా, కాస నర్సింహ, భిక్షపతి, ప్రవీణ్‌నాయక్, టి.ఇందిరా దేవేందర్, తాళ్ల కార్తీక్, సామ ప్రకాశ్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బండ నర్సింహ, తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

యాచారం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మస్కు నర్సింహ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను అధిక సంఖ్యలో గెలిపించుకోవాలన్నారు. గురువారం యాచారం మండల కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా కొరత సృష్టించి రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేయడానికి బీజేపీ కుట్ర చేస్తుందని, రాష్ట్రానికి సరిపడా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని అన్నారు. సామాజిక పింఛన్ల పెంపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారని, కొందరు రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరువ

ఆదిభట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జీవితంలో అత్యున్నత స్థాయికి చేరేందుకు పునాది రాయి విద్యార్థి దశ కీలకమని మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాకులు మస్తాన్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కప్పపహాడ్, నల్లవెల్లి, యాచారంలో 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వెన్నెల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్యూషన్ కేంద్రాలను ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ ఎ.భాస్కర్, మహేష్ దుర్గే, రాజశేఖర్, అశ్విని, భార్గవి, కల్పన ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కేశంపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కిసాన్ ఆగ్రో ఏజెన్సీ ఉదారత చాటుకుంది. మండల పరిధిలోని కోనాయపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు హరీశ్వర్‌రెడ్డి కిసాన్ ఆగ్రో ఏజెన్సీ వారిని కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏజెన్సీ తరఫున రూ.12వేలు ఖర్చుచేసి గ్రామ ంలో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. గురువారం కెమెరాలను ప్రారంభించారు. ఏజెన్సీ ప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.